ఉచితంగా చెస్ట్ క్యాన్సర్ పరీక్షలు



వైద్య శిబిరంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఏఐజీ ఆసుపత్రి గ్రాన్యూల్స్ ఇండియా సంయుక్తాధ్వర్యంలో మల్లాపూర్ భవానీ నగర్ కాలనీలో మంగళవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు క్యాంప్, బీపీ, షుగర్ టెస్ట్‌లను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై మట్లాడారు. ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ చిగురిపాటి పజ్ఞ, భవానీనగర్ కాలనీ అధ్యక్షులు గణేష్, నిర్మల, వెంకట్‌రెడ్డి, తిరుపతి, సురేష్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు !



హెచ్‌బీకాలనీ, అన్నపూర్ణకాలనీలో ఇలా..

కుషాయిగూడ: విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న కేబుల్ వైర్ల సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్, అన్నపూర్ణకాలనీలో కరెంటు స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుళ్లను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు భూ దాత దండు ఆగయ్య కుటుంబసభ్యులతో పాటు రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్–2025 అవగాహన కల్పించారు. మంగళవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటించి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. విద్యార్థులు తమ పుట్టినరోజు మొక్కలు నాటి ఇతరులకు బహుమతిగా ఇవ్వాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు బెజ్జం సునీత, సువర్చలదేవి, కమలాకర్‌రెడ్డి, పర్యావరణ సేవక్ భోగ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం

రామంతాపూర్: రామంతాపూర్ శ్రీకృష్ణ జన్మాష్టమి రథోత్సవ వేడుకలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం ప్రకటించిన విధంగా కీసర ఆర్డీఓ అధ్వర్యంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. హబ్సిగూడ ప్రాంతానికి చెందిన రుద్రవికాస్, రాజేందర్‌రెడ్డి, రామంతాపూర్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి కుటుంబాలకు చెక్కులను అందజేశారు. కాగా ఓల్డ్ రామంతాపూర్ చెందిన కృష్ణయాదవ్, సురేష్ యాదవ్‌ల కుటుంబసభ్యులు ప్రభుత్వం అందజేసిన చెక్కులను నిరాకరించారు.

అక్రమ నిర్మాణాలపై ఫోకస్ !

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు సీల్

చట్ట ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలంటున్న అధికారులు



శ్రీరాంనగర్ కాలనీ వద్ద వాణిజ్య భవనానికి సీల్ వేసిన అధికారులు

కాప్రా: సర్కిల్‌లోని ఏఎస్‌రావునగర్, కాప్రా, చర్లపల్లి డివిజన్లలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నా.. అక్రమ నిర్మాణదారులు మాత్రం అధికారులకే చాలెంజ్ విసిరేలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది రాజకీయ నేతల అండదండలతో నిర్మాణాలు చేపడుతూ.. జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ నేపథ్యంలోనే కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు మరోసారి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించారు.

ఆరు భవనాల సీజ్..

కాప్రా, చర్లపల్లి డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన 3 భవనాలను మంగళవారం సీజ్ చేశారు. చర్లపల్లిలో 2 భవనాలకు కాప్రాలో ఒక భవనానికి సీల్ వేశారు.

◆ కాప్రా శ్రీరాంనగర్ కాలనీ వద్ద ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టారు. సిల్ట్+2 రెసిడెన్షియల్ భవనానికి అనుమతి తీసుకుని అదనపు అంతస్తు నిర్మించడమే కాకుండా సెట్ బ్యాక్ వదలకుండా కమర్షియల్ షెటర్లు నిర్మించారు. ఈ భవనాన్ని గుర్తించిన అధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. అయినా సదరు భవన నిర్మాణదారుడు నిర్మాణ పనులు మాత్రం ఆపలేదు. నియోజకవర్గంలోని ఓ రాజకీయ పార్టీకి చెందిన ముఖ్యనేత అండ, మరికొందరి నేతల ప్రోత్సాహంతో అధికారులు ఇచ్చిన నోటీసులు లెక్క చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరుస కథనాలతో వెలుగులోకి..

ఈ అక్రమ నిర్మాణంపై మీడియాలో వరుస కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు సదరు భవనానికి సీల్ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు భవనానికి సీల్ వేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు. ఎవరైనా నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలి. అతిక్రమించి తర్వాత బాధపడొద్దు. అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణమోహన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ సిటీ ప్లానర్

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, న్యూ నర్సింహ్మనగర్ కాలనీలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో 4 రోజుల పాటు నిర్వహించిన కృష్ణా జన్మాష్టమి వేడుకలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు కృష్ణుడి ప్రతిమతో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. న్యూ నర్సింహ్మనగర్ నుంచి ఎన్టీఆర్‌నగర్, శాంతినగర్, మీర్‌పేట్, మల్లాపూర్‌ల మీదుగా ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తుల ఆటపాటలు, కోలాటాలు, భగవద్గీత శ్లోకాల పఠనం, జయ జయ ధ్వానాల మధ్య స్వామివారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.

స్థానిక సమస్యలపై కార్పొరేటర్ పర్యటన



సాయికృష్ణనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, సాయికృష్ణనగర్ కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలనీలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై ఆరా తీశారు. కాలనీలో తరచుగా విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయని, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు కావడంతో ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని చెప్పారు. కాలనీలో సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్‌కు స్థానికులు వివరించారు. ఏఈ బాలరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, వేణుపంతులు, హంసరావు, మోహన్‌రాజు, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.శోభారాణి, డా.శ్వేతకు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు



ఉప్పల్ పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

అల్వాల్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.26 వేల కనీస వేతనం నిర్ణయించాలని, వేతనాలతో కూడిన ప్రసూతి క్యాజువల్, మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, జిల్లా, రాష్ట్ర ఆస్పత్రుల్లో ఆశా వర్కర్లకు విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్వేతకు అందజేశారు.

ఉప్పల్: తమ డిమాండ్ల సాధనకు ఆశావర్కర్లు ఆందోళనకు దిగారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18000లను జూలై, ఆగస్ట్ 2 నెలల పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. ఉప్పల్ ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశావర్కర్లు ధర్నాకు దిగారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మతసామరస్యానికి 'ఎన్‌సీసీ' కృషి

మేడిపల్లి: మతసామరస్యం కోసం 'నేషన్ క్రిస్టియన్ కౌన్సిల్'(ఎన్‌సీసీ) ఎల్లప్పుడూ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్ అన్నారు. మంగళవారం ఫిర్జాదీగూడలోని బేతనీ క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో 'ఎన్‌సీసీ' బిజినెస్ వింగ్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ బలోపేతానికి ఎన్‌సీసీ బిజినెస్ వింగ్ సమావేశం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 9000040587 ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బక్క ఏలియా, బక్క ఏబెల్, రమేష్‌బాబు, బ్రదర్ సాల మోన్‌రాజ్, సతీష్, ప్రీతి, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం



ఓల్డ్ విలేజ్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు

మల్లాపూర్: ఇంజినీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తే చాలా సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. బస్తీబాటలో వెలువడిన సమస్యలను ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులను ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ స్రవంతి, జలమండలి డీజీఎం సతీష్, ఏఈ సిరాజుద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, సూపర్‌వైజర్ నరేష్, శివ, కాంగ్రెస్ నేతలు రాజేష్, సురేష్‌గౌడ్, హరి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన కోడికంటి లింగయ్య (55). ఈనెల 18న రాత్రి సమయంలో కాలకృత్యాల కోసం వెళ్లి రోడ్డు దాటుతుండగా.. ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకొచ్చిన అశోక్ అనే వ్యక్తి తన వాహనంతో లింగయ్యను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లింగయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతకు పితృవియోగం

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత పిట్టల శ్రీనివాస్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి పిట్టల సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం సత్తయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, నిరంజన్, ఎస్ఆర్.ప్రసాద్, సంతోష్, రాందాస్, యాదగిరి, ఆశ, యాది పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు !



సాయినగర్ హిల్స్ కాలనీలో తవ్విన డ్రైనేజీ పైపులైన్

మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలో సాయినగర్ హిల్స్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం తవ్విన మట్టిని రోడ్డుపై అడ్డంగా పోశారు. అయితే సదరు పని మొదలు పెట్టి నెలరోజులైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయమై నీరు నిలవడంతో ఇళ్లలోకి వెళ్లే రోడ్డులో డ్రెయిన్ కోసం తీసిన మట్టి, బండరాళ్లను అడ్డంగా పోయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు సాఫీగా వెళ్లేందుకు వీలు లేకుండా పైపులైన్ల కోసం తీసిన డ్రెయిన్ గుంతల్లోనే వరద నీరు నిలిచి వరద కాల్వలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు త్వరితగతిన డ్రైనేజీ పైపులైన్ పనులను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డాక్టర్ జగన్‌కు ఐక్యత అవార్డు



అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్‌కు జాతీయ ఐక్యత అవార్డు–2025 లభించింది. విద్య, పర్యావరణ రంగాల్లో ఆయన చేస్తున్న సేవలకు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు, వైస్ ప్రిన్సిపాల్ అడవి రాజు, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నిమజ్జనఘాట్‌లో ఏర్పాట్ల పరిశీలన



మల్కాజిగిరి: సఫిల్‌గూడ నిమజ్జనఘాట్‌ను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మరో 10 రోజుల్లో నిమజ్జనం ప్రారంభమవుతుందని, ఇప్పటికీ నిమజ్జనం చేసే బేబీపాండ్‌ను శుభ్రం చేయలేదన్నారు. బేబీ పాండ్ ఎత్తు పెంచాలని చెప్పామని చుట్టూ.. సుందరీకరణ పనులు (పెయింటింగ్) కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గుర్రపుడెక్క తొలగింపు పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన తొలగించాలని సూచించామన్నారు. రాంకీ వాహనాలను అదనంగా ఏర్పాటు చేయాలని జెడ్సీని కోరామన్నారు. నిమజ్జనఘాట్ నోడల్ అధికారైన డీఈ మహేష్ పూర్తిగా విఫలమయ్యారని, ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిమజ్జన ఘాట్‌కు దగ్గరలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పెన్సింగ్ వేయాలని ఏడీఈ చంద్రశేఖర్‌ను కోరామన్నారు. ఈఈ లక్ష్మణ్, ఏఈ నవీన్, వీఐ రమేష్ పాల్గొన్నారు.

కాప్రా: గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు మంగళవారం అధికారులు పర్యవేక్షించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. చెరువులో పెద్ద విగ్రహాలు, పక్కనే కొలనులో చిన్న,చిన్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డితో పాటు ఇతర పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో బంద్ ప్రశాంతం

● స్వచ్ఛందంగా మూసివేసిన వ్యాపారాలు
● నిరసన ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు



విద్యుత్ స్తంభాల నుంచి తొలగించిన కేబుళ్లు

రామంతాపూర్ : గోకుల్‌నగర్‌లో ఆదివారం అర్ధ రాత్రి జరిగిన దుర్ఘటన బాధిత కుటుంబాలకు సంఘీభావంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌లతో పాటు పార్టీలకతీతంగా స్థానికులు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్‌లో సంపూర్ణంగా బంద్ జరిగింది. బంద్ సందర్భంగా పలు వాణిజ్య సంస్థలు, పెట్రోల్‌బంక్‌లు, షాపింగ్ మాల్స్ మూసివేశారు. అనంతరం దూరదర్శన్ కేంద్రం నుంచి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిలతో పాటు కార్పొరేటర్లు కక్కిరేణి చేతన బండారి శ్రీవాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఘటన విద్యుత్ అధికారుల బాధ్యత రాహిత్యమేనని ఆరోపించారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్, టీవీ కేబుల్ వైర్లను తొలగించాలని, లేదంటే విద్యుత్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు ఉచితంగా చికిత్స అందించాలని కోరారు.

అండగా ఉంటాం..

ఈ దుర్ఘటనలో ఉప్పల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాటేపల్లి అంజిరెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి మృతి చెందిన ఘటన విదితమే. మృతుడి సోదరులు అమెరికా నుంచి రావాల్సి ఉండటంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు ప్రకటించారు. మంగళవారం బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

కేబుల్ వైర్ల తొలగింపు..

రామంతాపూర్‌లో వివిధ బస్తీలు, కాలనీల్లో స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను మంగళవారం ఉదయం నుంచే విద్యుత్ విభాగం సిబ్బంది తొలగించే కార్యక్రమం చేపట్టారు. రామంతాపూర్ బంద్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సర్వబాబు యాదవ్, జహంగీర్, బీజేపీ నేతలు బండారు వెంకటరావు, సంతోష్‌గుప్తా, తిరుపతయ్య, కుమార్ తదితరులున్నారు.



రామంతాపూర్‌లో బంద్ పాటిస్తున్న వాణిజ్య సంస్థలు



నిరసన ర్యాలీలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు రాగిడి, ఎన్వీఎస్ఎస్

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



దుర్గా భవానీ అమ్మవారు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని హనుమాన్ పేట్‌లోని దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి సహస్ర నామార్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు దుర్గాహోమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో ఆది మైసమ్మ ఆలయం..

అల్వాల్: మచ్చబొల్లారం బట్టన్‌గూడలోని ఆది మైసమ్మ ఆలయం పునర్నిర్మించి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఒడిబియ్యం పోసి, అన్నప్రసాద వితరణ చేశారు. రాజిరెడ్డి, శంకర్‌యాదవ్, కృష్ణ, పాండురంగరావు, మురళీ, విజయ్‌కృష్ణ, కృష్ణారావు, అనిల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మల్లాపూర్: బహిరంగ ప్రదేశాలు, ఖాళీస్థలం, రోడ్లపై చెత్త వేసిన వారిపై జరిమానా విధిస్తారని, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. వార్డు కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం ఉదయం, రాత్రి వేళల్లో చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓల్డ్ విలేజ్‌కు చెందిన యువత కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇంటి యజమానులు, అద్దెకు ఉంటున్న వారు కవర్లలో వ్యర్థాలను తీసుకొచ్చి పారవేస్తున్నారని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వ్యర్థాలు పడవేయకుండా సీసీ కెమెరాతో పాటు, మైక్ అన్స్‌మెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. రఘు, భూమండ్ల శ్రీశైలం, పైళ్ల మెహ్రాజ్, కుమార్‌యాదవ్, శ్రీధర్ తదితరులున్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు



మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ వినాయకనగర్ డివిజన్ పరిధిలోని చంద్రగిరి కాలనీలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుళ్ల తొలగింపు పనులు ఏఈ సుమనా క్రిస్టియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పలు ప్రాంతాలను సందర్శించి ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించారు. వినాయకచవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టామని వివరించారు. విద్యుత్ అధికారులు, అరుణ్, నర్సింగరావు, కృష్ణ, నాగేష్, బాలాజీ, రాముతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571